క్లుప్తంగా

బాలకృష్ణ బహిరంగ క్షమాపణ చెప్పాలి


మోరంపూడి రమేష్

సామర్లకోట: మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కించపర్చేలా మాట్లాడిన సినీ నటుడు, ఎమ్మెల్యే బాలకృష్ణ బహిరంగ క్షమాపణ చెప్పాలని మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ మోరంపూడి రమేష్ డిమాండ్ చేశారు. శాసన సభలో లేని వారిపై సభా మర్యాద పాటించకుండా, నోటికొచ్చినట్లు మాట్లాడటం సరికాదన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో 40 శాతం ఓట్లు గెలుచుకున్న మాజీ ముఖ్యమంత్రికి ప్రతిపక్ష హోదా ఇవ్వకుండా, కూటమి నాయకులు కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ఎంతో హుందాతనంతో వ్యవహరించే చిరంజీవిపై కూడా అనుచిత వ్యాఖ్యలు చేశారని విమర్శించారు. ఈ వ్యాఖ్యలను ప్రతి ఒక్కరూ ఖండించాలన్నారు.

మట్టి అక్రమ తవ్వకాలపై ఫిర్యాదు

సామర్లకోట: మండల పరిధిలోని అనేక గ్రామాల్లో మట్టి అక్రమ తవ్వకాలు జరుగుతున్నాయని వైఎస్సార్ సీపీ జిల్లా పరిషత్ విభాగం కాకినాడ జిల్లా అధ్యక్షుడు మోరంపూడి శ్రీరంగ నాయకులు సోమవారం ఇక్కడ తెలిపారు. ఈ మేరకు కాకినాడ ఆర్డీఓకు ఫిర్యాదు చేసినట్టు చెప్పారు. మట్టి తవ్వకాలకు అనుమతులు ఉన్నాయని ప్రచారం చేసుకుంటూ, జోరుగా మట్టిని కొల్లగొడుతున్నారని ఆరోపించారు. మట్టి తవ్వకానికి అనుమతులు ఉంటే రాత్రి సమయంలో ఎందుకు తవ్వకాలు చేస్తున్నారని ప్రశ్నించారు. దీనిపై విచారణ చేసి, ప్రభుత్వ ఆదాయానికి గండి పడకుండా చూడాలన్నారు.

19న ముత్తుస్వామి దీక్షితార్ వర్ధంతి

బోట్‌క్లబ్: నాదజ్యోతి ముత్తుస్వామి దీక్షితార్ వర్ధంతి సందర్భంగా స్థానిక సూర్యకళా మందిరంలో వచ్చే నెల 19న సాయంత్రం స్థానిక విద్యాంసుల ఆధ్వర్యంలో ముత్తుస్వామి దీక్షితార్ కృతుల గానం నిర్వహిస్తున్నట్లు ప్రముఖ గాయని పెద్దాడ సూర్యకుమారి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మహేంద్రవాడ నరసింహమూర్తి శిష్యులు, చిలుకూరి సుబ్బలక్ష్మి శిష్యులు, ప్రభల రాజేశ్వరి శిష్యులు, ఎం విజయకుమారి, చావలి సూర్యకుమారి శిష్యుల గాత్ర కచేరీ జరుగుతుందని వివరించారు. అనంతరం షేక్ సుభాని సాహెబ్, పసుపులేటి వేంకటరమణ, షేక్ రెహమాన్, రాయుడు బ్రదర్స్, షేక్ నజీర్ నాదస్వర కచేరీ జరుగుతుందన్నారు. కార్యక్రమానికి సంగీతాభిమానులు హాజరుకావాలని కోరారు.

లైట్‌గా తీసుకోవద్దు..!

- ఏళ్లు గడుస్తున్నా నిత్యం వెలుగుతున్న ఎల్‌ఈడీలు
- అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్ట
- పంచాయతీలకు భారంగా నిర్వహణ


ఉండూరు గ్రామంలో నిత్యం వెలుగుతున్న ఎల్‌ఈడీ వీధిలైట్లు

సామర్లకోట: గత టీడీపీ పాలనలో ఎల్‌ఈడీ వీధి లైట్లు ఏర్పాటు చేసి.. విద్యుత్ పొదుపు అవుతుందని అధికారులు, ప్రజాప్రతినిధులు భారీఎత్తున ప్రచారం చేశారు. అంతటితో ఆగకుండా ప్రతి పంచాయతీలోను, మున్సిపాలిటీలోను అంతకు ముందున్న లైట్లు తీసివేసి.. వాటి స్థానే ఎల్‌ఈడీ లైట్లు ఏర్పాటు చేశారు. మండల పరిధిలోని 18 గ్రామాల్లో సుమారు 3,600 ఎల్‌ఈడీ లైట్లు ఏర్పాటు చేశారు. పెద్దాపురం మండల పరిధిలోని 21 గ్రామాల్లో సుమారు 3,500 ఎల్‌ఈడీ లైట్లు ఉన్నాయి. వీటిలో 50 శాతం ఎప్పుడూ వెలుగుతూనే ఉంటున్నాయి. దీని కారణంగా పంచాయతీలకు పెను భారంగా మారుతున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా ఈ ఎల్‌ఈడీ లైట్ల నిర్వాహణ బాధ్యత అప్పగించిన కాంట్రాక్టర్ సకాలంలో స్పందించకపోవడంతో సమస్యలు ప్రారంభమయ్యాయి. ఈ లైట్లు నిత్యం వెలగడం వలన ఆర్థిక భారం తప్పడం లేదని సర్పంచ్‌లు వాపోతున్నారు. మండల వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో ఇదే పరిస్థితి నెలకొని ఉంది.

వార్డుల వారీ నిర్వహణ!

గతంలో ట్యూబ్ లైట్లు ఉన్న సమయంలో ప్రతి వార్డులో ఒక మీటరు, బ్యాక్సు ఏర్పాటు చేసి.. ఆయా పంచాయతీల సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది లైట్లు వెలిగించడం, ఆర్పివేయడం చేసేవారు. ఎల్‌ఈడీ లైట్లు వచ్చాక నిర్వహణ అంతా ఒకే ప్రాంతానికి పరిమితం చేయడంతో.. ఆయా పంచాయతీలు, మున్సిపాలిటీలకు ఇబ్బందులు ప్రారంభమయ్యాయి. గతంలో ఉండే బ్యాక్స్‌ల స్థానంలో సీసీఎంఎస్ బ్యాక్స్‌లు ఏర్పాటు చేశారు. ఈ బ్యాక్సుల్లో టైమింగ్ ఆధారంగా లైట్ల నిర్వహణ ఉంటుంది. ఈ బ్యాక్సులు మరమ్మతులు వచ్చిన సమయంలో మాన్యువల్‌గా బ్యాక్సులను ఉపయోగించే సౌకర్యం ఉంది. అయినా లైట్లు నిత్యం వెలుగుతూనే ఉంటున్నాయి. కొన్ని పంచాయతీల్లో సిబ్బంది వీధిలైట్లు వెలిగించడం, ఆర్పడం చేస్తున్నారు.

ఎల్‌ఈడీలపై అధికారుల నిర్లక్ష్యం



అధికారుల నిర్లక్ష్యంతో ఎల్‌ఈడీ లైట్లు నిత్యం వెలుగుతూనే ఉన్నాయి. నిత్యం లైట్లు వెలగడం వలన అవి పాడైపోతున్నాయి. దీనికి తోడు పంచాయతీలకు కరెంటు బిల్లు ఎక్కువగా వస్తుంది. స్ట్రీట్ లైట్ల జీవిత కాలం తగ్గిపోతుంది. మండల పరిధిలో అనేక గ్రామాల్లో ఇదే పరిస్థితి ఉంది.

– తలారి దొరబాబు, మండల అధ్యక్షుడు, వైఎస్సార్ సీపీ

సమస్యను పరిష్కరిస్తాం



మండల పరిధిలోని పంచాయతీ కార్యదర్శులు, అధికారులతో సమావేశం ఏర్పాటు చేసి ఎల్‌ఈడీ లైట్లపై చర్చిస్తాం. సమస్య పరిష్కారమయ్యే విధంగా చర్యలు తీసుకుంటాం. నిత్యం లైట్లు వెలగడం వలన వాటి జీవిత కాలం తగ్గిపోతుంది. అప్పటి వరకు సమస్యను పరిష్కరించేలా డిప్యూటీ ఎంపీడీవోకు బాధ్యత అప్పగిస్తాం.

– కె.హిమమహేశ్వరి, ఎంపీడీఓ, సామర్లకోట

ఉల్లాస్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి

మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్య


ఉల్లాస్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న కమిషనర్ తదితరులు

సామర్లకోట: మున్సిపాలిటీ పరిధిలోని చదువుకోని వయోజనులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఉల్లాస్ కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ ఎ.శ్రీవిద్య అన్నారు. సోమవారం పట్టణంలో ఆమె ఉల్లాస్ (అక్షరాంధ్ర కార్యక్రమం) కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, నిత్యం సాయంత్రం గంట పాటు ఈ కేంద్రంలో వయోజనులకు చదువు నేర్పిస్తారని తెలిపారు. కూలీ పనులకు వెళ్లొచ్చిన తరువాత ఈ కేంద్రం నిర్వహణ ఉంటుందని చెప్పారు. అనేక మందికి చదువు లేకపోవడం వలన మోసపోతున్నారని, అటువంటి వారిని గుర్తించి చదువు నేర్పిస్తారని వివరించారు. ఈ నేపథ్యంలో ఇప్పటికే వలంటీర్లను ఎంపిక చేసినట్టు చెప్పారు. చదువు వలన సమాజంలో, కుటుంబంలో గుర్తింపు, గౌరవం ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమానికి మెప్మా సిటి మిషన్ మేనేజర్ హుస్సేన్ అధ్యక్షత వహించారు. వయోజన విద్యా శాఖాధికారి ఆనంద బాబు చదువు వలన ఉపయోగాలను వివరించారు. ఈ సందర్భంగా వయోజనులకు అక్షరాంధ్ర వలంటీర్ శిక్షణ ఇచ్చారు.

గ్రీవెన్స్‌కు మూడు అర్జీలు


పీజీఆర్ఎస్‌లో అర్జీ స్వీకరిస్తున్న ఆర్డీఓ శ్రీరమణి

పెద్దాపురం: ప్రజా సమస్యల సత్వర పరిష్కారానికి ప్రతి వారం పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు పెద్దాపురం ఆర్డీఓ కె.శ్రీరమణి అన్నారు. గ్రీవెన్స్‌లో భాగంగా సోమవారం డివిజన్‌లో ఆయా మండలాల నుంచి మూడు అర్జీలు అందినట్లు చెప్పారు. అనంతరం ఆర్డీఓ విలేకర్లతో మాట్లాడుతూ, డివిజన్ స్థాయిలో వచ్చే ప్రతి అర్జీని ఆయా శాఖకు బదిలీ చేసి, సమస్య పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. ఆయా అర్జీలను సత్వరమే పరిష్కరించాలని సంబంధిత శాఖాధికారులకు ఆదేశించినట్టు తెలిపారు. కార్యక్రమంలో కార్యాలయ ఏఓ మాధవరావు, డీటీ భానుకుమార్, సీడీపీఓ ఉష, హౌసింగ్ అధికారి రవిశంకర్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

సామర్లకోట: తండ్రిని కోల్పోయిన పిల్లల కుటుంబానికి వైఎస్సార్ సీపీ పట్టణ మాజీ అధ్యక్షుడు మద్దాలి శ్రీను ఆర్థిక సాయం అందజేశారు. సోమవారం బిల్డింగ్‌కు పెయింటింగ్ వేస్తుండగా జారిపడిపడిన అరవ అరుణ్‌కుమార్ ఆస్పత్రిలో మృతి చెందాడు. ఆస్పత్రి వద్ద బిక్కుబిక్కుమంటూ ఉన్న ఇద్దరు పిల్లలను చూచి తనవంతుగా రూ.రెండు వేలు అందించారు.

పీహెచ్‌సీ వైద్యుల నిరసన బాట

నల్ల బ్యాడ్జీలతో విధులకు హాజరు

పెద్దాపురం: తమ సమస్యల పరిష్కారం కోరుతూ పీహెచ్‌సీ వైద్యులు ఆందోళన బాట చేపట్టారు. ఇందులో భాగంగా సోమవారం మండలంలోని పులిమేరు, కాండ్రకోట పీహెచ్‌సీ సిబ్బంది శాంతియుత నిరసన తెలిపారు. రోగులకు ఇబ్బందులు కలగకుండా నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతూ వైద్య సేవలందించారు. ఆయా ఆసుపత్రుల వద్ద సిబ్బంది తమ సమస్యలు పరిష్కరించాలంటూ నినాదాలు చేశారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ముందస్తుగా ఒక్కో పీహెచ్‌సీకి ఒక్కో అదనపు వైద్యుడిని నియమించడంతో.. వైద్యులు చేపట్టిన ధర్నాకు బదులు శాంతియుత నిరసనతో విధులు నిర్వహించడంతో రోగులకు ఇబ్బందులు తప్పాయి.


పులిమేరు పీహెచ్‌సీలో నల్ల బ్యాడ్జీతో విధులకు హాజరైన డాక్టర్


నిర్మానుష్యంగా ఉన్న వేట్లపాలెం పీహెచ్‌సీ

నిలిచిన వైద్య సేవలు

సామర్లకోట: సమస్యలు పరిష్కరించాలని వైద్యులు చేస్తున్న సమ్మెలో భాగంగా సోమవారం వేట్లపాలెం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో వైద్య సేవలు నిలిచిపోయాయి. మండల పరిధిలోని నవర, ఉండూరు పరిధిలో హెల్త్ క్యాంపులు కొనసాగాయి. ఆస్పత్రిలో పని చేస్తున్న డాక్టర్లు నల్ల బాడ్జీలు ధరించి విధులకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ పరదేవ్ మాట్లాడుతూ, జిల్లా కలెక్టర్ సూచనల మేరకు అత్యవసర కేసులకు వైద్యం అందిస్తారని, ఓపీని నిలిపివేశామని చెప్పారు.

తల్లికి పాప అప్పగింత


శ్రీపీఠంలో తప్పిపోయిన పాప

కాకినాడ రూరల్: దేవీ శరన్నవరాత్రులను పురస్కరించుకుని శ్రీపీఠంలో సరస్వతీ పూజలకు సోమవారం భారీగా విద్యార్థులు, చిన్నారులు తరలివచ్చారు. సుమారు మూడేళ్ల పాప తప్పిపోయి ఏడుస్తూ కనిపించడంతో, స్థానికుల సమాచారం మేరకు సర్పవరం సీఐ పెద్దిరాజు, ఎస్సై శ్రీనివాసకుమార్ స్పందించారు. మైక్ అనౌన్స్‌మెంట్ చేసి ఆ పాపను తల్లి చెంతకు చేర్చారు. రాజమండ్రికి చెందిన తల్లి పోలీసులకు ధన్యవాదాలు తెలిపింది.

సరస్వతీ నమోస్తుతే..


సామర్లకోట పంచారామ క్షేత్రంలో సరస్వతీదేవిగా..


పాదగయ క్షేత్రంలో శ్రీరాజరాజేశ్వరీదేవి


సరస్వతీదేవిగా తాటిపర్తి అపర్ణాదేవి అమ్మవారు


విశేషాలంకారంలో పాదగయ సరస్వతీదేవి


సరస్వతీదేవి అలంకరణలో పిఠాపురం మహాలక్ష్మీదేవి


పాదగయలో విశేషాలంకరణలో పురుహూతికా అమ్మవారు


పెద్దాపురం భువనేశ్వరి పీఠంలో సరస్వతీదేవిగా..


కొత్తపల్లిలో సరస్వతీదేవి అవతారంలో కనకదుర్గ

- సరస్వతీ దేవిగా బాలాత్రిపుర సుందరీదేవి
- విద్యార్థుల ప్రత్యేక పూజలు

సామర్లకోట: పంచారామ క్షేత్రంలో ఉన్న బాలా త్రిపుర సుందరీదేవి సోమవారం సప్తమి, మూల నక్షత్రాన్ని పురస్కరించుకుని సరస్వతీదేవి రూపంలో భక్తులకు దర్శనమిచ్చారు. శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా ఆలయంలో ఈ నెల 22 నుంచి అమ్మవారు నిత్యం ఓ రూపంలో భక్తులకు దర్శనమిస్తున్నారు. ఆలయ ఈఓ బళ్ల నీలకంఠం ఆధ్వర్యంలో ఉదయం స్వామివారికి ఏకాదశ రుద్రాభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన, శ్రీచక్ర నవవర్ణార్చన, సహస్ర గులాబీ అర్చన, దర్బారు సేవ, బాలా పరమేశ్వరీ మంత్ర జపం నిర్వహించారు. మహిషాసుర మర్దిని అమ్మవారి ఆలయం వద్ద గణపతి హోమం, రుద్రహోమం, సహస్ర చండీహోమాలు జరిగాయి. అమ్మవారిని బంగారు కిరీటం, బంగారు ఆభరణాలతో, కుమారారామ భీమేశ్వర స్వామిని వెండి ఆభరణాలు, పట్టు వస్త్రాలతో అలంకరణ చేశారు. స్వామివారికి ప్రీతైన రోజు కావడంతో అధిక సంఖ్యలో భక్తులు ఆలయానికి తరలివచ్చారు. మధ్యాహ్నం ఈఓ నీలకంఠం ఆధ్వర్యంలో అన్నప్రసాదం ఏర్పాటు చేశారు. ఆలయ పండితులు వేమూరి సోమేశ్వర శర్మ, అల్లికి రాజ్‌గోపాల్‌శర్మ, సన్నిధిరాజు వెంకటరమణ, చెరుకూరి రాంబాబు, శ్రీకాకుళపు సత్యనారాయణమూర్తి, వినయ్ పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. అయోధ్య రామపురంలోని కనకదుర్గ ఆలయంలోను, సత్తెమ్మ తల్లి ఆలయంలోను, బడేలమ్మ చెరువు వద్ద నవదుర్గ ఆలయం తదితర ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన కనకదుర్గ అమ్మవారి మండపాల్లో, మండలంలోని వివిధ గ్రామాల్లో ఉన్న కనకదుర్గ ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ఉండూరులోని లక్ష్మీదేవి ఆలయం, గొంచాల గ్రామంలోని కనకదుర్గ అమ్మవారిని సరస్వతీదేవిగా అలంకరించి, విద్యార్థులతో సరస్వతీ పూజలు చేయించారు.

సామూహిక పూజలు

పీబీ దేవం శ్రీశారద రామకృష్ణ సేవా సమితి ఆధ్వర్యంలో సరస్వతీదేవి పూజలు చేశారు. విద్యార్థులతో సమితి అధ్యక్షుడు తోటకూర గంగాధర్ ఆధ్వర్యంలో సామూహిక సరస్వతీ పూజలు చేయించారు. సమితి గౌరవాధ్యక్షుడు వింజమూరి సుబ్రహ్మణ్యశర్మ, కార్యదర్శి వింజమూరి విశ్వనాథ్, సభ్యులు నువ్వుల వెంకట్రాజు, బాబ్జి, సూర్యచంద్రరావు, సాంబశివరావు, నరసింహారావు, మాచరరావు సేవలందించారు.

మహా సరస్వతీదేవిగా..

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే ఇలవేల్పుగా పేరొందిన కాండ్రకోట నూకాలమ్మ, పెద్దాపురం మరిడమ్మ అమ్మవార్లు సోమవారం మహా సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. కార్యనిర్వాహణాధికారులు రాంబాబురెడ్డి, విజయలక్ష్మి ఆధ్వర్యంలో సామూహిక సరస్వతీ పూజలు జరిగాయి. వేద పండితులు ఆసాదులు అమ్మవార్లను సరస్వతీ రూపంలో అలంకరించగా, విద్యార్థులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. స్థానిక వర్జులవారివీధిలో ఉన్న భువనేశ్వరి పీఠంలో అమ్మవారు మహా సరస్వతీదేవిగా దర్శనమిచ్చారు. పీఠాధిపతి చింతా గోపి శర్మ సిద్ధాంతి ఆధ్వర్యంలో మండప ఆరాధన, అభిషేకాలు, సహస్ర కుంకుమ పూజ, నవచండీ పారాయణం, శ్రీచక్రార్చన, చండీ హోమం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. మండలంలోని ఆనూరు, చదలాడ, పులిమేరు, గోరింట, గుడివాడ, సిరివాడ, చంద్రమాంపల్లి, దివిలి, తిరుపతి గ్రామాల్లో అమ్మవార్ల గుళ్ల వద్ద సామూహిక సరస్వతీ పూజలు నిర్వహించారు. చిన్నారులు దుర్గాలయాల వద్ద పెన్ను, పుస్తకాలను ఉంచి ప్రత్యేక పూజలు చేశారు.

సరస్వతీదేవిగా రాజరాజేశ్వరీదేవి

పిఠాపురం: శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా సోమవారం పాదగయ క్షేత్రంలో రాజరాజేశ్వరీ దేవి అమ్మవారు సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. మూల నక్షత్రం సందర్భంగా సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. దసరా ఉత్సవాలను పురస్కరించుకుని శ్రీరాజరాజేశ్వరీ దేవి, అష్టాదశ శక్తి పీఠాల్లో పదో శక్తిపీఠానికి అధిష్టాన దేవతైన పురూహూతికా అమ్మవారికి విశేషార్చనలు నిర్వహించారు. శ్రీకుక్కుటేశ్వర స్వామి వారికి అభిషేకాలు నిర్వహించగా, వేలాది మంది భక్తులు అమ్మవారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సామూహిక అక్షరాభ్యాసాలు, పూజలు

రాజరాజేశ్వరీదేవి అమ్మవారు సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమివ్వగా, వేద పండితులు సామూహిక అక్షరాభ్యాసాలు నిర్వహించారు. పాదగయ క్షేత్రంలో వెలసిన సరస్వతీదేవి అమ్మవారి ఆలయంలో పలువురు విద్యార్థులతో సరస్వతీ పూజలు జరిపించిన పురోహితులు.. చిన్నారులతో అక్షరాభ్యాసాలు చేయించారు. విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు. పిఠాపురంలో మహాలక్ష్మి, కన్యకాపరమేశ్వరి, గొల్లప్రోలు మండలం తాటిపర్తి అపర్ణాదేవి, దుర్గాడ లలితాదేవి ఆలయాల్లో అమ్మవార్లు సరస్వతీదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. వేద పండితులు సామూహిక అక్షరాభ్యాసాలు చేయించారు.

ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు

కొత్తపల్లి: శరన్నవరాత్ర ఉత్సవాల్లో భాగంగా సోమవారం మండలంలోని దుర్గాదేవి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. స్థానిక ధర్మశాస్తా ఆలయంలోని కనకదుర్గ అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు నిర్వహించారు. గాదులదొడ్డిలో ఉన్న బాలదుర్గా ఆలయం వద్ద దీపాలంకరణ ఏర్పాటు చేశారు. కొండెవరంలో దుర్గాదేవి ఆలయం వద్ద కుంకుమార్చనలు జరిగాయి. వివిధ చోట్ల కనకదుర్గ ఆలయాల్లో ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.


పిఠాపురం లక్ష్మీదేవి ఆలయంలో అక్షరాభ్యాసాలు నిర్వహిస్తున్న అర్చకులు


దుర్గాడ రామలింగేశ్వర స్వామి ఆలయంలో సామూహిక అక్షరాభ్యాసాలు


పీబీదేవంలో సామూహిక సరస్వతీ పూజల్లో పాల్గొన్న విద్యార్థులు


సామర్లకోట పంచారామ క్షేత్రంలో చండీహోమం

మున్సిపల్ ఆస్తులపై నిర్లక్ష్యం తగదు

- వాహనాలు తుప్పు పట్టినా పట్టించుకోరా!
- అధికారుల తీరుపై మండిపడిన సభ్యులు
- వాడీవేడిగా కౌన్సిల్ సమావేశం


అధికారులను నిలదీస్తున్న కౌన్సిలర్ రాజశేఖర్


సమావేశం నిర్వహిస్తున్న ఇన్‌చార్జి చైర్మన్ సాయిప్రసాద్

పెద్దాపురం: రూ.లక్షలు వెచ్చించి కొనుగోలు చేసిన మున్సిపల్ వాహనాలు సక్రమంగా వినియోగించకపోవడంతో.. మూలకు చేరి తుప్పు పట్టినా పట్టించుకోవడం లేదని, మున్సిపల్ ఆస్తులపై అధికారులకు ఇంత నిర్లక్ష్యం తగదని కౌన్సిల్ సభ్యులు మండిపడ్డారు. పెద్దాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం సోమవారం మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా సీనియర్ కౌన్సిలర్ విజ్జపు రాజశేఖర్ మాట్లాడుతూ, సుమారు రెండేళ్ల కిందట మున్సిపాలిటీకి శానిటరీ అభివృద్ధిలో భాగంగా వచ్చిన మోటార్ వెహికల్స్‌ని ప్రారంభించకుండా, వాడకుండా పక్కన పెట్టడం వల్ల వాహనాలు తుప్పు పట్టి, పాడైపోయాయన్నారు. వాటికి మరమ్మతులు చేసి వినియోగంలోకి తేవాలన్నారు. అలాగే మరమ్మతులకు గురైన ట్రాక్టర్లు, ఫాగింగ్ మెషీన్లనూ వినియోగంలోకి తీసుకురావాలన్నారు. దీనిపై కమిషనర్ శ్రీకాంత్ రెడ్డి స్పందిస్తూ, సత్వరమే ఆయా వాహనాల మరమ్మతులకు చర్యలు చేపడతామన్నారు. కౌన్సిలర్ గోడేడ మరిడయ్య మాట్లాడుతూ, తమ వార్డులో బోర్‌వెల్ ఏర్పాటుపై అధికారుల నిర్లక్ష్యం తగదన్నారు. స్థలం మున్సిపాలిటీది కాదంటూ ఎవరో అంటే, ప్రజావసరమైన తాగునీటి సమస్యపై అధికారులు వారికి వంత పాడడమేమిటని నిలదీశారు. అవసరమైతే తాను సొంత ఖర్చులతో వార్డు ప్రజల దాహార్తిని తీరుస్తానంటే, బోర్‌వెల్ స్థలం మున్సిపాలిటీది కాదంటూ రాజకీయం చేయడం తగదన్నారు. సత్వరమే ఆ వార్డు తాగునీటి సమస్యపై చర్యలు తీసుకోవాలని ఇన్‌చార్జి చైర్మన్ సాయిప్రసాద్ ఆదేశించారు. కౌన్సిలర్ త్సలికి సత్యభాస్కర్ మాట్లాడుతూ, రాత్రివేళ పారిశుధ్య పనులు చేపట్టడం వల్ల వ్యాపారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సమయం మార్చి ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా పారిశుధ్య పనులు చేపట్టాలన్నారు. పట్టణంలోని బూస్టర్ వద్ద ఉన్న మున్సిపల్ గెస్ట్‌హౌస్‌ను అందుబాటులోకి తీసుకురావాలన్నారు. గతంలో బల్క్‌మిల్క్ సెంటర్ ఉండేదని, ప్రస్తుతం బిల్డింగ్ నిరుపయోగం కాకుండా మున్సిపాలిటీ స్వాధీనం చేసుకుని, గెస్ట్‌హౌస్‌గా ఉపయోగపడేలా చూడాలన్నారు. కౌన్సిలర్ కనకదుర్గ మాట్లాడుతూ, ఎస్సీఆర్ కాలనీలో మంచినీటి సరఫరా పూర్తి స్థాయిలో లేకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. కనీసం వీధి కుళాయిలు ఏర్పాటు చేయాలన్నారు. ట్యాంకుల ద్వారా వచ్చే మంచినీరు కొందరికే సరిపోతుందని, కాలనీవాసులకు మంచినీరు అందక ఇబ్బందులు పడుతున్నారన్నారు. చైర్మన్ సాయిప్రసాద్ మాట్లాడుతూ, స్థానిక గోనీ కోనేరు, పాండవుల మెట్ట వద్ద కూడా సంపుల నిర్మాణం చేపడితే, పట్టణ ప్రజలకు మంచినీటి అవస్థలు తగ్గుతాయని, దీనిపై అధికారులు దృష్టి సారించాలన్నారు. అనంతరం ప్రజా సమస్యలపై వాడీవేడి చర్చ సాగింది ఈ సమావేశంలో మున్సిపల్ మేనేజర్ జ్యోతిరాణి, కో-ఆప్షన్ సభ్యులు షేక్ రఫీ, వాసంశెట్టి గంగ, కౌన్సిలర్లు విడదాసరి రాజా, ఆరెళ్లి వీర్రాఘవులు, పప్పల దుర్గారావు, ఆయా వార్డుల కౌన్సిలర్లు, వివిధ విభాగాల అధికారులు పాల్గొన్నారు.

గందరగోళం మధ్య ముగిసిన మహాజన సభ

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): అరుపులు, కేకల మధ్య గందరగోళ పరిస్థితులు నెలకొనడంతో ది జయలక్ష్మి సొసైటీ మహాజన సభ అర్థంతరంగా ముగిసింది. స్థానిక దంటూ కళాక్షేత్రంలో సోమవారం సొసైటీ 4వ మహాజన జరిగింది. సొసైటీ చైర్మన్ త్రినాథరావు సమావేశంలో 7 తీర్మానాలు, 10 సవరణలను ప్రవేశపెట్టారు. దీనికి వ్యతిరేకంగా సభ్యులు ప్రస్తుతం ఉన్న కమిటీని మొత్తం రద్దు చేయాలని, కమిటీని నియమించి మూడేళ్లు గడుస్తున్నా తమకు ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదని బాధితులు మండిపడ్డారు. జిల్లా సహకార శాఖ అధికారులు సైతం పాలకవర్గానికి మద్దతు పలుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు మహిళా సభ్యులు మాట్లాడుతూ, తాము చాలా నిరుపేదలమని, కష్టపడి దాచుకున్న సొమ్ము ఎక్కువ వడ్డీకి ఆశపడి ఈ బ్యాంకులో డిపాజిట్లు చేశామన్నారు. సభకు పరిశీలకుడిగా వచ్చిన జిల్లా సహకార అధికారి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, బాధితులకు అన్ని విధాలా న్యాయం చేస్తామని, కానీ కొందరు సభ్యులు తమపై నిందలు వేయడం తగదన్నారు. ఉన్నతాధికారుల సూచనలు మేరకు ఇక్కడకు వచ్చామని, ఇక్కడ జరిగిన విషయాలను జిల్లా కలెక్టర్, ఉన్నతాధికారులకు నివేదిస్తానన్నారు. కలెక్టర్ ఈ విషయాన్ని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారన్నారు. తీర్మానాలు, సవరణలు ఆమోదం పొందకుండానే మహాజన సభ ముగుస్తున్నట్లు ప్రకటించారు. సమావేశం అనంతరం పలువురు బాధితులు గాంధీభవన్‌లో సమావేశమయ్యారు. తదుపరి కార్యాచరణ రూపొందించుకునేందుకు తీర్మానించారు. ఈ సమావేశంలో బాధితులు, సంఘ నాయకులు ఈరంగి రఘుభూషన్, గోదావరి చక్రవర్తి, ప్రసాదరావు, గొల్లపల్లి వెంకటరత్నం, అప్పాజీ పాల్గొన్నారు.